క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ బదిలీ..?

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ స్పందన బదిలీ అవుతున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఆమె స్థానంలో శంకరంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు రానున్నట్లు సమాచారం. సంగారెడ్డి జిల్లా మెప్మా పీడీగా విధులు నిర్వహిస్తున్న స్పందన 2024 డిసెంబర్ 19న కామారెడ్డి మున్సిపల్‌కు ఫుల్ అడిషనల్ చార్జ్(ఎఫ్ఏసీ) కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. నెల రోజుల్లోనే ఆమె బదిలీ అవుతున్నట్లు తెలవడంతో కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. ఇంకా అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది.

బ్రహ్మంగారి ఆలయానికి విరాళం



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి కాకతీయనగర్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి బీజేపీ నాయకుడు బి.రాజుపాటిల్ రూ.25 వేల విరాళం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగయ్య విశ్వకర్మ, ప్రతినిధులు ఆంజనేయులు, మోహనాచారి, సతీష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఇన్వర్టర్ ఏర్పాటుకు రూ.60వేల వితరణ



మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ శిక్షణ నిమిత్తం కోడ్ హోప్ గ్లోబల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా ఇన్వర్టర్ ఏర్పాటుకు రూ 1.11 లక్షలు అవసరం ఉండగా.. గ్రామానికి చెందిన పంచాయతీ రాజ్ రిటైర్డు ఏఈ తిరుపతి రెడ్డి మంగళవారం రూ.50 వేలు అందజేశారు. గురువారం అదే గ్రామానికి చెందిన మాధవరెడ్డి ఆయన మామ తిమ్మన్నగారి రాజిరెడ్డి జ్ఞాపకార్థం రూ.60 వేలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మోకాళ్లపై నిలబడి నిరసన



బాన్సువాడ : నాలుగు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆస్పత్రి ఎదుట కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్‌రాములు మాట్లాడుతూ.. వేతనాలను చెల్లించే వరకు ధర్నాలు చేపడతామని అన్నారు. కార్మికులు రేణుక, సురేఖ, కమర్, జైల్‌సింగ్, సంగీత, గంగారాం, సుశీల, కాశీరాం, శంకర్, అనసూయ, తదితరులున్నారు.

పాఠశాలల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గట్టుమైసమ్మ తండా, సురాయిపల్లి తండా, కొట్టాల్ గడ్డ తండా ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈవో షౌకత్ అలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎఫ్ఎల్ఎన్, బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎఫ్ఏ3, ఎస్ఏ1 పరీక్షల మూల్యాంకన వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. సీఆర్పీ సంగాగౌడ్, హెచ్ఎంలు సుజాత, మురళీకృష్ణ, మహిపాల్ తదితరులున్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో వైద్య శాఖ ఆధ్వర్యంలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వైద్యురాలు అనిత అవగాహన కల్పించారు.వీడీసీ అధ్యక్షుడు సూర్యకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, వీడీసీ ప్రతినిధులు ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. కుష్టువ్యాధి దినోత్సవం సందర్భంగా వెద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు గ్రామాలలో తిరుగుతూ కుష్టువ్యాధిపై అవగాహన కల్పించడమే కాకుండా ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఈవో నారాయణ, సూపర్‌వైజర్ పాప, ఆశావర్కర్లు తదితరులున్నారు.

చదువులకు దూరంగా చిన్నారులు

- టీచర్లు, ఆయాలు లేక అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు
- పట్టించుకోని ఐసీడీఎస్ అధికారులు



బయట ఆడుకుంటున్న చిన్నారులు



మాగిలో తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

నిజాంసాగర్(జుక్కల్): ఐదేళ్ల లోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందని ద్రాక్షగా మారుతోంది. బాన్సువాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మాగి, తిమ్మనగర్ తండా, కంశెట్‌పల్లి, వీరాపూర్, టిక్యా నాయక్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేకపోవడంతో మూతపడ్డాయి. ఆయా కేంద్రాల పరిధిలో నాలుగైదు నెలల నుంచి చిన్నారులు ప్రిస్కూల్ చదువులకు దూరమయ్యారు. టీచర్‌తో పాటు ఆయాలు పదవీ విరమణ పొందడంతో అంగన్‌వాడి కేంద్రాలు మూతపడ్డాయి. ఆయా గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలకు నెలనెలా బాలామృతంతో పాటు పౌష్టికాహారాన్ని సూపర్ వైజర్లు అందజేస్తున్నారు. చిన్నారులకు మాత్రం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందడం లేదు. పోస్టులను ప్రభుత్వం త్వరితగతిన భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	222
సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలు	118
అద్దె భవనాల్లో కొనసాగుతున్నవి	59
కమ్యూనిటీ హాల్, తరగతి గదుల్లో కొనసాగుతున్నవి	44

బాన్సువాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులు

మండలం	టీచర్ పోస్టులు	ఆయా పోస్టులు
నిజాంసాగర్	2	7
మహమ్మద్‌నగర్	2	7
పిట్లం	4	23
బాన్సువాడ	4	9
బీర్కూర్	4	7
నస్రుల్లాబాద్	3	8

“ నెలకు సరిపడా సామగ్రిని పంచుతున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేని చోట ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు సామగ్రిని పంపిణీ చేస్తున్నాం. అలాగే చిన్నారులకు సైతం మెనూ ప్రకారంగా పౌష్టిక ఆహారం అందించేలా తల్లులకు సామగ్రిని ఇస్తున్నాం. ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. – సౌభాగ్య, ఐసీడీఎస్ సీడీపీవో, బాన్సువాడ

‘కేంద్రం దృష్టికి సోయా రైతుల కష్టాలు’



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): నెలల తరబడి సోయా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ మంత్రి భగీరథ చౌదరీ, ఐఏఎస్ దీపక్ చౌదరీలను కలిసి వినతి పత్రం అందజేశారు. మద్నూర్ వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం మూతపడటంతో డోంగ్లి మండల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. 8 వేల క్వింటాళ్ల మేర సోయా కొనుగోలు చేస్తే రూ.4 కోట్లు రైతులకు లబ్ధిచేకూరుతుందని పేర్కొన్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పారు.

వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వద్దు



మద్నూర్(జుక్కల్): రోగులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వద్దని డిప్యూటీ డీహెచ్ఎంవో శ్రీవిద్య సూచించారు. పెద్ద శక్కర్గాలోని సబ్ సెంటర్‌ను గురువారం ఆమె తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌లోని మందులు, రికార్డులను ఆమె పరిశీలించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యులు శ్రీలేఖ, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



బాన్సువాడ రూరల్: దివ్యాంగ విద్యార్థులకు ప్రతిరోజు ఫిజియోథెరపి చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ ఎంఈవో నాగేశ్వరరావు అన్నారు. గురువారం భవిత కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ఫిజియోథెరపి శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు చేదోడు వాదోడుగా ఉండాలన్నారు. వారి వైకల్యాన్ని అవహేళన చేయకుండా ఆదరించాలన్నారు. ఫిజియోథెరపిస్ట్ గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

కృత్రిమ గర్భధారణతోనే మేలైన దూడలు

- మండల పశువైద్యాధికారి రాంచందర్



రెడ్డిపేటలో పశువులకు చికిత్స చేస్తున్న వైద్యాధికారి

రామారెడ్డి: కృత్రిమ గర్భధారణతో మేలైన దూడలు పుడతాయని మండల పశువైద్యాధికారి రాంచందర్ అన్నారు. గురువారం రెడ్డిపేటలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాంచందర్ ప్రారంభించి మాట్లాడారు. పశువు సకాలంలో ఎదకు రావాలంటే వాటికి నట్టల మందులు, మినరల్ మిక్సర్ లాంటివి తప్పకుండా వాడాలని సూచించారు. 15 సాధారణ చికిత్సలు, 55 గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 4 కృత్రిమ గర్భధారణ చికిత్సలు చేసి, 15 దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చినట్లు తెలిపారు. స్థానిక వీఎల్‌వో శ్రీనివాసరావు, కొండల్ రెడ్డి, నారాయణ, రమేశ్, సిబ్బంది ఆంజనేయులు, బాలమణి పాల్గొన్నారు.

మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదు



ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

మద్నూర్(జుక్కల్): హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదని బీజేపీ మండల అధ్యక్షుడు తెప్ప తుకారం అన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మను మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

బాధిత విద్యార్థులకు పరామర్శ



ఎల్లారెడ్డి: ఫుడ్‌పాయిజన్‌తో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆర్డీవో మన్నె ప్రభాకర్ గురువారం పరామర్శించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎండీఎం ఫుడ్‌పాయిజన్ కావడంతో వాంతులు చేసుకున్నారు. దీంతో వారిని ఆర్డీవో పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని సూపరింటెండెంట్ రవీంద్రమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు ఆర్డీవోకు తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆర్డీవో సూచించారు.

ఘనంగా మస్తాన్ షావలీ ఉర్సు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గురువారం మస్తాన్ షావలీ ఉర్సును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీమొద్దీన్ ఇంటి నుంచి గంధం, పూలు, చాదర్‌ను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అంబేడ్కర్ చౌరస్తా వరకు ఊరేగించారు. అనంతరం మస్తాన్ షావలీ దర్గాలో గంధం, పూలు, చాదర్ సమర్పించి ప్రార్థన చేశారు.

ఏబీఎస్ఎస్ వార్షికోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మెల్లకుంటతండాలో గురువారం ఏఐబీఎస్ఎస్(ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం) 72వ వార్షికోత్సవాన్ని గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలో ఏబీఎస్ఎస్ జెండాను మండలాధ్యక్షుడు వరోజ్యా నాయక్ ఎగురవేశారు. ఏబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్ ఆదేశాలమేరకు తండాలో జెండా ఎగురవేశామని వరోజ్యానాయక్ తెలిపారు.

సమాచారం..

సమావేశం వాయిదా

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నిర్వహించాల్సిన సమీక్ష సమావేశం వాయిదా పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున సమావేశాన్ని వాయిదా వేశారు.

జాతిపితకు ఘన నివాళి



భిక్కనూరులో గాంధీవిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మద్నూర్‌లో గాంధీ చిత్రపటం వద్ద..



బాన్సువాడలో..



బిచ్కుందలో ..



రామేశ్వర్‌పల్లిలో ..



దోమకొండలో..



కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో.. వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, అధ్యాపకులు

సాక్షి నెట్‌వర్క్: స్వాతంత్య్ర సమరయోధుడు, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని జిల్లాలో పలుచోట్ల గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గాంధీ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అహింసా మార్గంలో స్వాతంత్య్రం తెచ్చి భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. భారతదేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.



లింగాపూర్‌లో..



జిల్లా కేంద్రంలో .. సీపీఎం నాయకులు



భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో..



ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో..

ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలుచేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకర్‌చారి సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు లేకుండా చూడాలన్నారు. అలాగే వచ్చే నెల 15 లోపు వందశాతం పన్నులను వసూలు చేయాలన్నారు. జాబ్‌కార్డ్ కలిగి ఉండి 20 రోజులకు మించి పనులు చేసిన వారి నుంచి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ఈసీ సాయిలు ఉన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వినతి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, భారతీయ విద్యార్థి మోర్చా(బీవీఎం) విద్యార్థి సంఘాల నాయకులు గురువారం ఎంఈవో ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. కనీస సౌకర్యాలు లేవని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ కుమార్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, నాయకులు అర్బాస్, మణికంఠ, తదితరులున్నారు.

టెక్నాలజీతో అద్భుతాలు సాధించొచ్చు



కామారెడ్డి టౌన్: తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ యాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ హైస్కూల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఐటీ గ్లోబల్ చైర్మన్ సందీప్ మక్తల విద్యార్థులకు ఆయా రంగాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల కంటే ఎక్కువగా పరిజ్ఞానం ఉంటుందని, ప్రస్తుతం వస్తున్న నూతన టెక్నాలజీని వినియోగించుకుంటే ఎన్నో అద్భుతాలు సాధించవచ్చని వివరించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ప్రతినిధులు మహమ్మద్ సాజిద్, సాయి, డేవిడ్, అజయ్, అనీష్ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు



బాన్సువాడ: అమరవీరుల దినోత్సవం సందర్భంగా బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులు నివాళులర్పించారు. సబ్ కలెక్టర్ కిరణ్మయితో పాటు అధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్య్ర సంగ్రామంలో ప్రాణాలర్పించిన అమరవీరుల గురించి తెలుసుకోవడం ఎంతో ముఖ్యమైన విషయమన్నారు. స్వాతంత్య్రం కోసం అనేక మంది అమరులయ్యారని, వారి త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్నామని అన్నారు.

సంక్షిప్తం

సత్యసాయి ప్రతినిధుల సేవా కార్యక్రమాలు

కామారెడ్డి అర్బన్: సత్యసాయి శతజయంతి సందర్భంగా స్థానిక వీక్లీ మార్కెట్‌లోని రాజరాజేశ్వరీ, లక్ష్మమ్మ ఆలయాలను సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు గురువారం శుభ్రం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ప్రతినిధులు పండరి, సహదేవ్, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. బుధవారం నాటికి 2 లక్షల 73 వేల 640 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పరీక్షలంటే భయాన్ని వీడాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలని ఇంపాక్ట్ ఆర్గనైజర్ నక్క నవీన్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగడానికి పాటించాల్సిన నియమాలను వివరించారు. ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, తదితరులున్నారు.

వాహనదారులు హెల్మెట్లు ధరించాలి

ఎల్లారెడ్డిరూరల్: వాహనదారులు హెల్మెట్లు ధరించాలని కోరుతూ పోలీసులు గురువారం వాహనదారులకు గులాబీ పూలను అందించారు. పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్సై మహేష్, పోలీసు సిబ్బందితో కలిసి వాహనదారులకు పూలను అందించారు. వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని సూచించారు.

ప్రారంభమైన అయ్యప్ప ప్రాణప్రతిష్ఠ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప దీక్షాపరులు, భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(కుర్ద) గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం పంపిణీ చేసినట్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన కొత్త సావిత్రికి రూ.60 వేలు, కుమ్మరి సృజనకు రూ.15,500 విలువైన చెక్కులను అందజేశారు. యూత్ అధ్యక్షుడు సంతోష్, నాయకులు భాను, నారాయణ, దుర్గయ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తమకు బకాయిపడిన మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ మండలంలోని ఉపాధిహామీ సిబ్బంది గురువారం నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారికి వినతిపత్రాన్ని అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడం వల్ల తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. తమకు మూడునెలల వేతనాలను వెంటనే చెల్లించాలని వారు కోరారు. ఉపాధిహామీ పథకం ఈసీ సాయిలు పాల్గొన్నారు.